

కలెక్టర్ సుడిగాలి పర్యటన
కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రావికమతం, రోలుగుంట మండలాల్లో పర్యటించి, అభివృద్ధి పనులు పరిశీలించారు. 8లో



విద్యార్థినులకు జేసీ పాఠాలు
జేసీ జాహ్నవి కోటవురట్ల తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. బాలికల హైస్కూలుకు వెళ్లి లెక్కల బోధించారు. 8లో



అష్టదళ పద్మారాధన
విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

న్యూస్‌రీల్

మిస్ టీన్ ఏపీగా యశస్విని



యలమంచిలి: మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్–2023 విజేతగా యలమంచిలి మున్సిపాలిటీలోని కట్టుపాలెం గ్రామానికి చెందిన పండూరు యశస్విని ప్రతిభ కనబరిచింది. ఇటీవల విశాఖపట్నంలోని ఒక హోటల్‌లో నిర్వహించిన స్టార్ కిడ్స్ ఫ్యాషన్ షో గ్రాండ్ ఫినాలేలో యశస్విని మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్ టైటిల్ సాధించింది. రెండు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది యువతీ యువకులు ఆడిషన్స్‌కి వస్తే వారిలో 68 మందిని తుది పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో విజయం సాధించిన యశస్వినిని బిగ్ బాస్ ఫేమ్ అనిల్ రాథోడ్, మిస్టర్ ఒలింపియాడ్ అరుణ్‌పాల్, మిస్ ఇండియా–2022 సంతోషిణి బహుమతులు అందజేశారు. యశస్వినిని యలమంచిలి పట్టణం, కట్టుపాలెం ప్రజలు అభినందించారు.

ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు ప్రారంభం



గండిని పూడ్చుతున్న యంత్రాలు

మాకవరపాలెం: వాతావరణం అనుకూలించడంతో ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని రాచపల్లి వద్ద ఏలేరు కాలువకు గండి పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పనులు చేపట్టగా, వర్షం కారణంగా గండి పూడ్చివేత పనులను నిలిపివేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం అనుకూలించడంతో జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో పనులను ప్రారంభించారు. గండి పడిన చోట ఇనుప గొట్టాలను అడ్డంగా ఉంచి రాతి మూటలను వేసి పూడ్చివేత పనులు చేస్తున్నారు. వర్షం లేకుండా ఉంటే ఈ పనులు బుధవారం ఉదయానికి పూర్తయ్యే అవకాశం ఉంది. పనుల వద్ద జీవీఎంసీ ఈఈ చిరంజీవి, డీఈ కామేశ్వరరావు, ఏఈ వెంకటరావు ఉన్నారు.

లంపీస్కిన్ వ్యాధి నివారణకు టీకాలు
జిల్లా వ్యాప్తంగా 1,48,100 డోసులు సిద్ధం



లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువు

అనకాపల్లి రూరల్: పశువుల్లో లంపీస్కిన్ వ్యాధి నివారణకు జిల్లా వ్యాప్తంగా టీకాలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన అనకాపల్లిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 4 నెలల వయసు దాటిన పశువుల కోసం లక్షా 48 వేల 100 డోసుల టీకాలను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో చర్మం మీద దద్దుర్లు, విపరీతమైన జ్వరం తదితర లక్షణాలు కనబడతాయన్నారు. పశువుల్లో ఈ లక్షణాలు కనిపిస్తే స్థానిక రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాల్సిందిగా రైతులకు సూచించారు.

వాతావరణ అధికారి హైమారావు పదవీ విరమణ
సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రంలో వాతావరణ అధికారిగా పనిచేస్తున్న కె.హైమారావు పదవీ విరమణ చేశారు. ఈయన వాతావరణ శాఖలో 35 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించారు. పూణే, గన్నవరం, హైదరాబాద్, మచిలీపట్నం, విశాఖపట్నంలలో పని చేశారు. పదవీ విరమణ చేసిన హైమారావును తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద సత్కరించారు.

ప్రశాంతంగా ఫార్మేటివ్ పరీక్షలు
విశాఖ విద్య: ఫార్మేటివ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, గణితం పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీఈఆర్టీ ప్రశ్నాపత్రంతో ఒకే విధానంలో పరీక్ష జరిగింది. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పేరిట విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నందున ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి కృష్ణ కుమార్ తెలిపారు.

నవశకానికి నాంది



వేదికపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు విడదల రజని, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, సురేష్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, రహేజా ప్రతినిధులు

- దక్షిణాదిలో అతి పెద్ద ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ
- ఏయూలో కీలక భవనాల్ని ప్రారంభించిన సీఎం
- నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకూ బాటలు
- విశాఖ ప్రగతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి నీరాజనం
- అడుగడుగునా అఖండ స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారు. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత కైలాసపురంలో రూ.600 కోట్లతో రహేజా గ్రూపు నిర్మించనున్న ప్రఖ్యాత ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందులో ఐటీ క్యాంపస్, స్టార్ హోటల్ వంటివి కూడా నిర్మిస్తారు. ఈ మాల్ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిది వేల మందికి ఉపాధి లభించనుంది. సుమారు రూ.134.58 కోట్లతో జీవీఎంసీ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు అదే ప్రాంగణం నుంచి సీఎం శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి రూ.129 కోట్లతో చేపట్టిన ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్, బయో మానిటరింగ్ హబ్ (ఎలిమెంట్), ఆల్గారిథమ్, ఎ–హబ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఏయూ అవంతి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. వీటి ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఏడు వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇలా కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖ నగరం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల చేపట్టిన ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే విశాఖ రూపురేఖలు ఎంతగానో మారిపోనున్నాయి. మౌలిక సదుపాయాలు మరింతగా విస్తరించనున్నాయి. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరుతెన్నులను వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి సీఎంకు వివరించారు. ఏయూలోనూ విద్యార్థులు థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు. అందుకు ప్రతిస్పందనగా ముఖ్యమంత్రి తన కారు ఫుట్ రెస్ట్‌పై నిల్చొని విద్యార్థులకు అభివాదం చేశారు.



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న రహేజా గ్రూప్ ప్రతినిధులు



అవంతి ఆక్వా కల్చర్ హబ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏయూలో ప్రాజెక్టులను రిమోట్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం జగన్



పరికరాలను పరిశీలిస్తున్న సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తరలివచ్చిన అభిమానులు



జీవీఎంసీ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

• అభిమాన పూలవర్షం



పోర్ట్ ఆస్పత్రి వద్ద సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌పై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

విశాఖ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మునుపటి కంటే మిన్నగా అపూర్వ స్వాగతం లభించింది. ఎయిర్‌పోర్టు నుంచి కైలాసపురం పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు ఆయన ప్రయాణించిన వాహనంపై పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. విమానాశ్రయం నుంచి జాతీయ రహదారి వెంబడి కిలోమీటర్ల మేర మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మానవహారంగా ఏర్పడి జై జగన్ ప్లకార్డులతో ఘనంగా స్వాగతించారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారు, తన కోసం ఎదురుచూస్తున్న వారిని దృష్టిలో ఉంచుకొని సీఎం తన వాహనాన్ని ఆపిస్తూ వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. ఉదయం 11.13 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నగరంలో అన్ని కార్యక్రమాలను ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 2.28 గంటలకు తాడేపల్లికి విమానంలో పయనమయ్యారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విమానంలో విశాఖ వచ్చారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాస్, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులున్నారు.

సచివాలయానికి కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను అందిస్తున్న హెటిరో ప్రతినిధులు

నక్కపల్లి: మండల కేంద్రమైన నక్కపల్లి గ్రామ సచివాలయానికి హెటిరో కంపెనీ యాజమాన్యం రూ.3 లక్షల విలువైన కంప్యూటర్లను అందించింది. కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్) కార్యక్రమాల్లో భాగంగా సంస్థ చైర్మన్ డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం వీటిని అందించారు. కంపెనీ డీజీఎంలు రాజారెడ్డి, సుబ్బారెడ్డి, కుళ్లాయి రెడ్డిలు ఎంపీడీవో శ్రీనివాసరావు, మండలపరిషత్ ఏవో సీతారామరాజు సమక్షంలో వీటిని కార్యాలయానికి అప్పగించారు. హెటిరో యాజమాన్యానికి పంచాయతీ ప్రజల తరఫున ఏపీయుఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ నేతల రత్నకుమారిలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ వీసం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు 'రైవాడ' నీరు విడుదల



రైవాడ ఎడమ కాలువ నుంచి ఆయకట్టుకు విడుదలవుతున్న సాగునీరు

దేవరాపల్లి: నీటిపారుదల శాఖ అధికారులు రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు మంగళవారం నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ దమ్ములు చేసేందుకు నీరు విడుదల చేయాలన్న ఆయకట్టు రైతుల వినతి మేరకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకున్నారు. స్లూయిజ్ గేట్లు ఎత్తి ఇరిగేషన్ అధికారులు కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. కుడి కాలువ ద్వారా ఇప్పటికే 50 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా తాజాగా ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్ వరి నాట్లు వేసేందుకు దమ్ములు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం విడుదల చేసిన నీటితో కొందరు రైతులు దమ్ములు చేస్తుండగా.. ఇప్పటికే దమ్ములు చేసిన రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

'కోనాం' నీరు విడుదల నేడు

చీడికాడ: మండలంలో కోనాం జలాశయం నుంచి సాగునీటిని బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నామని జలాశయం డీఈ వేణుగోపాలరావు చెప్పారు. మాడుగుల మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం నుంచి కూడా పంట పొలాలకు సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు.

నేటి నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ



గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన టీహెచ్‌ఆర్ కిట్లు

అనకాపల్లిటౌన్: జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టేక్ హోమ్ రేషన్–టీహెచ్‌ఆర్) కిట్ల సరఫరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అనకాపల్లి సీడీపీవో పి.ప్రభావతి మంగళవారం సాక్షికి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలు హాజరు కానున్నట్లు వెల్లడించారు. అనకాపల్లి నియోజకవర్గంలో 234 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,395 మంది గర్భిణులు, 1,169 మంది బాలింతలు, ఏడు మాసాల నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలు 6,926 మంది, 3 నుంచి 6 ఏళ్ల పిల్లలు 1,877 మంది ఉన్నట్లు తెలిపారు. టేక్ హోమ్ రేషన్ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలున్న ప్రతి ఇంటికి ఈ నెల 2 నుంచి పోషకాహార పంపిణీ జరుగుతుందన్నారు. ఒక్కో కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో వంట నూనెతో పాటు వైఎస్సార్ కిట్స్ కింద 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో చొప్పున బెల్లం, ఎండు ఖర్జూరం, చెక్కీలు, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లను ఉచితంగా అందిస్తామన్నారు.

జగనన్న సురక్ష.. జనులకు శ్రీరామరక్ష

- మారుమూల గ్రామాలకూ సంక్షేమ లబ్ధిని అందించే అపూర్వ కార్యక్రమం
- అన్ని శాఖల సిబ్బంది అంకిత భావంతో జిల్లాలో విజయవంతం
- ఒక్క నెలలో 3.50 లక్షల ధ్రువపత్రాలు జారీ:కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ ష్మరణ్ రాజ్, డీఎల్‌డీవో మంజులవాణి

సాక్షి, అనకాపల్లి: సచివాలయ వ్యవస్థను సక్సెస్ బాటలో నడిపించే జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతమైందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. 'జగనన్న సురక్ష' ద్వారా జిల్లాలో 522 సచివాలయాల పరిధిలో 5,28,814 కుటుంబాలకు సంబంధించి 3 లక్షల 50 వేల 066 ధ్రువపత్రాలను జూలై నెలలో అందజేశామని తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజుకు సగటున పది వేల పత్రాలను అందించామన్నారు. ఈ ప్రక్రియలో పాలు పంచుకున్న ఆయా శాఖల జిల్లా అధికారులతోపాటు మండల, గ్రామ సచివాలయ స్థాయి ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో గుర్తించామన్నారు. అర్హతున్నా.. అందని వారికి న్యాయం చేశామన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించడమనే కార్యక్రమం హర్షించదగిందని కొనియాడారు.

జగనన్నకు చెబుదాం (1902) ద్వారా ప్రజా సమస్యలుంటే చెప్పాలని కలెక్టర్ కోరారు. ఒకవైపు ప్రజా సమస్యల కోసం స్పందన, జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చే ఫిర్యాదులను పరిష్కరిస్తూ.. మరోవైపు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నేరుగా గ్రామాల్లోనే క్యాంపులు పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించామన్నారు.

తొలి ప్రాధాన్యం ధ్రువపత్రాలకే..

ఏ పథకానికైనా ధ్రువపత్రం ప్రామాణికమని, దానిపై ముందుగా దృష్టి పెట్టామని కలెక్టర్ చెప్పారు. వితంతు పింఛను పథకం సామాజిక, సాంకేతిక కారణాల వల్ల కొన్ని చోట్ల ఆలస్యం అవుతున్నట్లు గుర్తించామన్నారు. 24 మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు నిబద్ధతతో పనిచేశారన్నారు. సమస్యలు మిగిలి ఉన్నట్లయితే 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయం జారీ చేసిన వివాహ ధ్రువపత్రం కావాలని ప్రజలు కోరుతున్నారని విలేకరులు చెప్పగా.. 60 రోజుల వరకు సచివాలయ ధ్రువపత్రం పనిచేస్తుందని వివరించారు. జిల్లాలో మొత్తం 3 లక్షల 61 వేల 880 అభ్యర్థనలు అందాయని, వాటిలో 3,59,951 సేవాపరమైనవని చెప్పారు. వాటిలో 3,50,066 పరిష్కరించామన్నారు. 3,330 తిరస్కరించగా 6,555 అపరిష్కృతంగా (పెండింగ్‌లో) ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం 144 ఆధార్ సెంటర్లు ఉన్నాయని, త్వరలో ఇంకా పెంచుతామని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్ రాజ్, జీఎస్‌డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి, డీఎల్‌డీవో మంజులవాణి పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో దేవరాపల్లి
జగనన్న సురక్ష కార్యక్రమంలో దేవరాపల్లి మండలంలో 9079 దరఖాస్తులు, సమస్యలు రాగా.. 100 శాతం పరిష్కరించామని కలెక్టర్ చెప్పారు. ఈ మండలం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో అత్యధిక దరఖాస్తులు, సమస్యలు అనకాపల్లి మండలంలో 21,132 వచ్చాయన్నారు. జిల్లావ్యాప్తంగా 24 మంది ఎంపీడీవోలు, స్పెషల్ అధికారులతో గడువు సమయంలోనే దాదాపు పరిష్కరించామన్నారు.

మలేరియా ప్రభావిత గ్రామాల గుర్తింపు



- జిల్లాలో 52 గ్రామాల్లో మలేరియా కేసులు
- జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర

మాడుగుల రూరల్: జిల్లాలో మలేరియా జ్వరాలు ప్రబలేందుకు అవకాశమున్న గ్రామాలను గుర్తించినట్లు జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) కిముదు వరహాలుదొర తెలిపారు. మంగళవారం కేజే పురం పీహెచ్‌సీకి వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల మధ్య ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల వల్ల కూడా వారి రాకపోకల సమయంలో వ్యాప్తి చెందుతున్నట్టు గుర్తించామన్నారు. జిల్లా వ్యాప్తంగా మలేరియా ప్రబలే 52 గ్రామాలను గుర్తించామని, ఈ గ్రామాల్లో ఇప్పటికే దోమల నివారణ మందును రెండు సార్లు స్ప్రే చేసినట్లు పేర్కొన్నారు.

మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది సారథ్యంలో నెల రోజు లనుంచి చేపడుతున్న ఇంటింటి సర్వే 86 శాతం పూర్తి చేశామన్నారు. జిల్లాలో 5 లక్షల 47 వేల 765 గృహాల్లో 4 లక్షల 42 వేల 148 గృహాల్లో సర్వే చేపట్టినట్టు తెలిపారు. ఈ సర్వే ఆధారంగా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇతర సిబ్బంది తమ లాగిన్‌లో కేసులు వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. ప్రతి మూడేళ్లకోసారి గిరిజన గ్రామాల్లో దోమ తెరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 5 లక్షల దోమతెరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తల సారథ్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించి, సత్ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, నాతవరం తదితర మండలాల గిరిజన గ్రామాల్లో ఈ వర్షాకాలంలో మలేరియా జ్వరాలు ప్రబలకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

అనంతరం ఆయన కేజే పురం పీహెచ్‌సీలోని ల్యాబ్‌ను పరిశీలించారు. మలేరియా, టైఫాయిడ్ తదితర కేసుల వివరాలను ల్యాబ్ టెక్నిషియన్లు కోటి, నాయుడులను అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

మేఘాలయ ఎంఎస్‌ఆర్‌ఐ సిబ్బంది సందర్శన


ప్రకృతి వ్యవసాయంపై మేఘాలయ సిబ్బందికి అవగాహన పరుస్తున్న దృశ్యం

మాడుగుల : మండలంలో ఎం. కోడూరులో అనకాపల్లి ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ ఏర్పాటు చేసిన ప్రకృతి వనరుల కేంద్రాన్ని మేఘాలయ (ఎంఎస్‌ఆర్‌ఐ) స్టేట్ రూరల్ లైవ్లీ పుడ్ సొసైటీ సంస్థ సభ్యులు మంగళవారం సందర్శించారు. వీరికి ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం ఆర్. స్వామినాయుడు, ఇక్కడ ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న తీరు, కషాయాలు తయారీ, వాటి ఉపయోగాలు, పక్షి స్థావరాలు, వరిలో లైన్‌షోయింగ్, కలుపు తీసే పద్ధతులు, ఎరపంటలు గురించి వివరించారు.మేఘాలయ సిబ్బంది వారి ప్రాంతంలో ఈ విధానం అములు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రీజన్ కోఆర్డినేటర్ ఆదిత్య, స్థానిక సిబ్బంది డంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై కేసు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం సచివాలయంలోని అవకతవకలపై పంచాయతీ కార్యదర్శి రజని ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు. సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సుధీర్, మహిళా పోలీసులు రాజేశ్వరి, వెంకటలక్ష్మి, వలంటీర్ నానాజీలపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం వీరికి 41ఏ నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇచ్చామన్నారు.

ప్ర‘జల’కు చేరువలో సేవలు

- నర్సీపట్నంలో జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయం
- పరిపాలన సౌలభ్యంతో సాగుదారులకు మెరుగైన సేవలు



నర్సీపట్నంలో ఏర్పాటైన జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయం

నర్సీపట్నం: జిల్లాలో మేజరు ప్రాజెక్టు తాండవతోపాటు ఇతర నీటి వనరుల పరిరక్షణకు మరో అడుగు పడింది. ఇంత వరకు ఉమ్మడి జిల్లాగా విశాఖ నుంచి జరిగే పర్యవేక్షణ మరింత చేరువైంది. దీనివల్ల జలవనరుల విభాగంలో ఎప్పటికప్పుడు జరుగుతున్న మార్పులను పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో వాటిని సరిచేసేందుకు వీలుపడే విధంగా నర్సీపట్నంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటైంది. ఇలా నిరంతర పర్యవేక్షణతో జలవనరులపై ఆధారపడ్డ రైతులకు మేలు చేకూరనుంది. ప్రతి రెవెన్యూ డివిజన్‌లో జలవనరుల శాఖ డివిజనల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్‌లు ఉండగా, నర్సీపట్నంలో ఇటీవల నూతనంగా జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అనకాపల్లికి సంబంధించి చోడవరంలో డివిజనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

విశాఖ కేంద్రంగా పర్యవేక్షణ కొరవడటంతోనే...

జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు సత్వర సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు విశాఖ కేంద్రంగా జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయం నడిచేది. జలాశయాలు, ఆనకట్టలు, చెరువులకు సంబంధించిన పనులకు అక్కడకు వెళ్లాల్సి వచ్చేది. పరిధి ఎక్కువగా ఉండటం వల్ల అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండేది. ఇకనుంచి ఈఈ స్థాయి అధికారి నర్సీపట్నంలోనే ఉండటం వల్ల పర్యవేక్షణ పెరగడంతోపాటు సాగునీటి అవసరాలకు సంబంధించిన పనులకు సత్వరమే పరిష్కారం లభించనుంది. డివిజన్ కార్యాలయం పరిధిలో మేజర్ ప్రాజెక్టులైన తాండవ, కల్యాణపులోవ, రావణాపల్లి జలాశయాలు, 45 ఆనకట్టలు, 984 సాగునీటి చెరువుల కింద 70 నుంచి 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జలాశయాలను డీఈలు పర్యవేక్షించేవారు. ఈఈ స్థాయి అధికారి రావడంతో కింద స్థాయి అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈఈ కింద నర్సీపట్నం, తాండవ, యలమంచిలి, పాయకరావుపేట పరిధిలో నలుగురు డీఈలు, 13 జేఈలు విధులు నిర్వర్తిస్తున్నారు.

రైతులకు ప్రయోజనం..



డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో రైతులకు మేలు చేకూరుతుంది. పరిపాలన సౌలభ్యంలో భాగంగా కొత్తగా డివిజన్ కార్యాలయం ఏర్పాటైంది. రైతులకు మెరుగైన సేవలు అందించడానికి వీలవుతుంది. రూ.43 లక్షలతో తాండవ జలాశయం మరమ్మతులు చేపడతాం. కల్యాణపులోవ, రవాణాపల్లి జలాశయాల కాలువలు రూ.5 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి పరిపాలన ఆమోదం వచ్చింది. తాండవ జలాశయం పరిధిలో వివిధ పనులకు రూ.6.6 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బొత్స శ్రీనివాసరావు, ఈఈ, నర్సీపట్నం

సీఎంకు ఘన స్వాగతం



విశాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి, విశాఖపట్నం: నగరంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో ఉదయం 11.13 గంటలకు సీఎం విమానాశ్రయానికి చేరుకున్నారు. నగర పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2.28 గంటలకు గన్నవరం బయలుదేరారు. మేయర్ హరి వెంకటకుమారి, ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు తదితరులు ముఖ్యమంత్రి స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. సీఎంతో పాటు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వచ్చారు.

సీఎం దృష్టికి హృద్రోగి సమస్య

మునగపాక: విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన.. మునగపాక గ్రామానికి చెందిన హృద్రోగి దొడ్డి రామకృష్ణ ఆరోగ్య పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రామకృష్ణ కొంతకాలంగా గుండె మార్పిడి చికిత్సకు సంబంధించి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రామకృష్ణ కుటుంబ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉండడంతో శస్త్రచికిత్సకు దాతల సాయం కోరుతున్నారు. విశాఖ వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రామకృష్ణ అనారోగ్యానికి సంబంధించిన రిపోర్టు వివరాలను ప్రసాద్ అందజేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన విద్యార్థి


అక్షయ్‌ను తండ్రి గణేష్‌కు అప్పగిస్తున్న ఎస్‌ఐ దివాకర్‌యాదవ్

అనకాపల్లి టౌన్: అదృశ్యమైన ఎనిమిదో తరగతి విద్యార్థి దరిమిశెట్టి అక్షయ్(14)ను పట్టణ పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. ఎస్‌ఐ దివాకర్‌యాదవ్ వివరాల మేరకు... మండలంలో తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధికి చెందిన అక్షయ్ సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతడి తండ్రి గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తులో భాగంగా తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానంగా తిరుగుతున్న బాలుడ్ని పట్టుకుని విచారించగా, పూర్తి వివరాలు చెప్పడంతో అక్కడ పోలీసులు అనకాపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- నిందితుడి అరెస్ట్
- సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు

శృంగవరపుకోట(విజయనగరం జిల్లా): ఎస్.కోట పట్టణాన్ని ఉలిక్కి పడేలా చేసిన మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఆర్.గోవిందరావు వెల్లడించిన వివరాల ప్రకారం... ఈనెల 30న ఎస్.కోటలోని చందన్ లాడ్జిలో ఒక మహిళ మృతి చెందినట్లు మేనేజర్ గనివాడ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలిని పరిశీలించి రూమ్ నంబర్ 103లో మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపారు. తర్వాత విచారణలో మృతురాలు విశాఖ జిల్లా దేవరాపల్లికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మగా గుర్తించారు. గత నెల 24న అరకు మండలం ఉరుముల గ్రామానికి చెందిన మాదాల శ్రీరాములు ఇక్కడ లాడ్జిలో రూమ్ బుక్ చేశాడని, ఆ వ్యక్తే హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడిని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్టు చేశారు.


పవన్‌కల్యాణ్‌తో మాదాల శ్రీరాములు (నిందితుడు)

డబ్బుల కోసం గొడవపడి..

మృతురాలు ఈశ్వరమ్మను లాడ్జికి తీసుకెళ్లానని, తర్వాత డబ్బుల కోసం గొడవ పడ్డామని, ఆమెను గోడకు గుద్దేయడంతో తలకు గాయమై పడిపోగా తర్వాత మెడకు చీర బిగించి హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించాడు. మరుసటి రోజు లాడ్జికి వచ్చి మృతురాలి ఒంటిపై 4బంగారు గాజులు, దుద్దులు, ఉంగరం తీసుకుని, ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టాడు. బ్యాంక్ నుంచి 60 గ్రాముల బంగారం, నిందితుడి నుంచి రెండు మొబైల్స్, పల్సర్ బైక్, లక్ష రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వివరించారు. ఈ హత్య కేసులో నిందితుడు జనసేన పార్టీ నాయకుడని చెబుతున్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన


జీలుగులోవ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

- వ్యాధుల కాలం అప్రమత్తంగా ఉండాలని సూచన
- రావికమతం, రోలుగుంట మండలాల్లో అభివృద్ధి పనుల పరిశీలన

రావికమతం: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మండలంలోని కొత్తకోట, జెడ్.కొత్తపట్నం, జీలుగులోవ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కొత్తకోట పీహెచ్‌సీని సందర్శించారు. ఆశ డే సందర్భంగా ఆశ కార్యకర్తల సమావేశమై వారితో కాసేపు మాట్లాడారు. ఇది వ్యాధుల కాలం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల సర్వే ఎలా ఉందని ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం రోగుల గదులను సందర్శించి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూడాలని వైద్యాధికారి రజనికి సూచించారు. పీహెచ్‌సీ నిర్మాణానికి స్థలం ఇచ్చామని, ఏదైనా ఉపాధి కల్పించాలని అయితి నానాజి దంపతులు కోరగా, వారి సమస్యపై నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అనంతరం జెడ్.కొత్తపట్నం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. 20 గ్రామాలకు సౌకర్యంగా ఉన్న కాలువ రోడ్డును అభివృద్ధి చేయాలని మండల ఎక్స్‌అఫిషియో మెంబర్ గాలి రమణబాబు కోరారు.

జీలుగులోవ రోడ్డు అభివృద్ధిపై ప్రశంసలు..

జి.మాడుగులకు సమీపంలో రావికమతం మండలానికి శివారు కొండపై ఉన్న జీలుగులోవకు కనీసం బైక్ వెళ్లే రహదారినైనా ఏర్పాటు చేయాలని గతంలో కలెక్టరేట్ వద్ద ఆ గ్రామస్తులు ఆందోళన చేయగా, కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ఉపాధి హామీ పథకం నిధులతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. దీన్ని కలెక్టర్ పరిశీలించి వారిని, నిర్మాణానికి శ్రమదానం చేసిన గిరిజనులను అభినందించారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నర్సీపట్నం ఆర్డీవో జయరాం, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, పీవో ఉషారాణి, పీఆర్ డీఈ ప్రసాద్, ఏపీవో దాడి వెంకట కాశిఅప్పారావు పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

విద్యార్థులకు మేలైన బోధనందించాలి

రోలుగుంట: విద్యార్థులకు మేలైన బోధనందించి తద్వారా విద్యా లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం రోలుగుంట మండలం జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు –నేడు పనులు పరిశీలించారు. 6, 7, 8 తరగతులకు ప్రవేశపెట్టిన అభ్యసన అభివృద్ధి కార్యక్రమం అమలు తీరు గురించి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన స్వయంగా పరిశీలించి, విదార్థుల విద్యా సామర్థాలను అంచనా వేశారు. అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఎంపీపీ పాఠశాలను పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి తిరిగి వెళ్తున్న కలెక్టర్‌ను గ్రామస్తులు కలిసి బడి సమీపం నుంచి మద్యం షాపు తరలించాలని ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, తహసీల్దార్ కె.వరహాలు, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో అన్నాబత్తుల హేమంత్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పాఠాలు చెప్పిన జేసీ


9వ తరగతి విద్యార్థులకు గణితంలో సులభ పద్ధతులు వివరిస్తున్న జేసీ జాహ్నవి

- కోటవురట్లలో ఆకస్మిక పర్యటన
- రెవెన్యూ సిబ్బందితో సమీక్ష

కోటవురట్ల : జాయింట్ కలెక్టర్ జాహ్నవి కోటవురట్లలో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించిన ఆమె సుమారు గంట సేపు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష చేశారు. సమగ్ర భూ సర్వేకు సంబంధించి జరుగుతున్న జాప్యంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాలలో త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు జానకమ్మను ఆదేశించారు. రాట్నాలపాలెంలో గెడ్డ పోరంబోకును కొందరు అక్రమించుకుని ఇళ్లు కట్టేశారని, దీనిపై స్పందనలో కూడా ఫిర్యాదు చేశామని నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు జేసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జానకమ్మకు ఆదేశాలిచ్చారు. అక్కడి నుంచి స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు వెళ్లి పరిసరాలు, టాయిలెట్స్ పరిశీలించారు. విద్యార్థులు చేతులు కడిగే ప్రాంతంలో బురదమయంగా ఉండడంతో ఇలా ఉంటే మీరేం చేస్తున్నారంటూ ఎంఈవో–2 శ్రీ జోష్‌ను ప్రశ్నించారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలించి దీనిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. స్లాబ్ లెవెల్ వరకు వచ్చాక ఆపేస్తే ఎలా పూర్తి చేయించండి అంటూ ఆదేశించారు. 9వ తరగతి గదిలోకి వెళ్లి ఆమె ఓ ఉపాధ్యాయురాలిగా మారిపోయారు. సిబ్బంది అందరినీ బయటకు పంపించేసి విద్యార్థులకు గణితం, సోషల్ సబ్జెక్టులలో పలు అంశాలు బోధించారు. బ్లాక్ బోర్డుపై గణితంలోని క్యూబిక్ చాప్టర్‌కు సంబంధించి సమస్యను రాసి ఎవరైనా పరిష్కరించాలని కోరారు. దాంతో ఓ విద్యార్థిని వచ్చి సమస్యను పరిష్కరించడంతో అభినందించారు. ఇలా సుమారు గంట పాటు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాధారణ పరిశీలనలో భాగంగానే వచ్చినట్టు తెలిపారు. జిల్లాలో సమగ్ర భూ సర్వే పారదర్శకంగా జరుగుతోందన్నారు. మాకవరపాలెం తహసీల్దారు కార్యాలయంలో రాత్రి సమయంలో విశ్రాంత ఉద్యోగితో రికార్డుల పరిశీలన విషయంపై వివరణ కోరగా దానిపై విచారణ చేస్తున్నామని, అక్రమాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీటీ సోమశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సామిల్లు తనిఖీ చేసిన అటవీ శాఖాధికారులు


కలపను తనిఖీ చేస్తున్న నర్సీపట్నం రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ లక్ష్మీ నర్స

కోటవురట్ల : అన్నవరం శివారున ఉన్న సామిల్లును నర్సీపట్నం రేంజ్ అటవీ శాఖాధికారి లక్ష్మీ నర్స మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట సామిల్లుల యజమానులు, కార్మికులు ఆందోళన చేపట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించినట్టు లక్ష్మీ నర్స తెలిపారు. రికార్డులు పరిశీలించి కలపను తనిఖీ చేయగా అనుమతి లేకుండా అక్రమంగా ఎటువంటి కలప లేదన్నారు. ఎక్కడా అక్రమాలు చోటు చేసుకోకుండా తమ సిబ్బంది ఎప్పటికపుడు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా కలపను కటింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు

విశాఖపట్నం ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం డీడీ మోహినీకుమారి


రికార్డులను పరిశీలిస్తున్న ఉపసంచాలకురాలు డాక్టర్ మోహినీకుమారి

నర్సీపట్నం: పాడి పశువులకు సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని విశాఖపట్నం ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఉప సంచాలకురాలు(డి.డి) డాక్టర్ పి.మోహినీకుమారి సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో డాక్టరు వైఎస్సార్ నియోజకవర్గ స్థాయి వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన రికార్డును పరిశీలించారు. ల్యాబ్‌లో పరీక్షల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.ఉదయను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సూచనలను సిబ్బందికి అందించారు. పరీక్షలకు వచ్చే రైతులకు నమ్మకలిగేలా పని చేయాలన్నారు. ఈ విషయంలో జాప్యం చేయొద్దన్నారు. ఆమె వెంట తిరుపతి రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టరు డి.రాణీప్రమీల, జాతీయ ఆంత్రాక్స్ ప్రాజెక్టు సమన్వయ అధికారి డాక్టరు షా హుస్సేన్, విశాఖపట్నం పశు సహాయ శస్త్ర చికిత్సలు ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం డాక్టరు ఎం.హిమజ ఉన్నారు.

మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలి

జె.నాయుడుపాలెం జెడ్పీ హైస్కూలులో డీఈవో వెంకటలక్ష్మమ్మ తనిఖీ


జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

రోలుగుంట: మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మండలంలోని జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాబుద్ధులను స్వయంగా తెలుసుకున్న ఆమె ఉపాధ్యాయులకు సులువైన బోధన కోసం అవసరమైన మెలకువలపై పలు సూచనలు చేశారు. దీనిలో భాగంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ ప్రకారం ఆ రోజు చేసిన వంటకాలను పరిశీలించారు. వాటి రుచి చూసి రాగిజావ తయారీని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు భోజన సమయంలో కాచి చల్లార్చిన నీటిని ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. వంటల వద్ద ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని హెచ్‌ఎం దాడిశెట్టి రమేష్‌కుమార్‌ను ఆదేశించారు. తరచూ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పర్యవేక్షించాలని ఎంఈవో పూడి జగ్గారావుకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు శరగడం సాయి

చోడవరం రూరల్: చోడవరం–అనకాపల్లి ప్రధాన రహదారిలో విశాఖ డెయిరీ బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రం వద్ద రోడ్డు ప్రమాదంలో గజపతినగరం గ్రామానికి చెందిన సాయి(22) మృతి చెందాడు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శరగడం రామకృష్ణ కుమారుడు సాయి సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై తన ఇంటి నుంచి చోడవరం బయలు దేరాడు. బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రం వద్దకు వచ్చేసరికి చోడవరం వైపు సైకిల్‌పై వెళ్తున్న లెక్కల అప్పారావు కుమారుడు రామారావును చీకట్లో గమనించే లోపు ఢీకొట్టాడు. దీంతో పట్టుతప్పిన సాయి మోటార్‌సైకిల్‌తోపాటు రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో సాయి తలకు తీవ్ర గాయమైంది. అతడిని చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.

మృతిచెందిన సాయి పెదనాన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎ.సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

9 మందికి కంటి శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ అనంతరం రోగులతో వైద్యుడు, ఆస్పత్రి చైర్మన్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో చూపు మందగించిన 9 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆస్పత్రి వైద్యుడు కె.మల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఆయన మాట్లాడుతూ గత నెల 31న 42మంది రోగులను పరీక్షించగా, 9 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించినట్లు వెల్లడించారు. ఆపరేషన్ చేసిన రోగులకు మూడు రోజులు పాటు ఆస్పత్రిలో వైద్యసేవలు అందించి, అవసరమైన మందులిచ్చి ఇంటికి చేర్చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌వైర్ల కింద జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈ నెల 3న విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్లు అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి నుంచి పూడిమడక జాతీయ రహదారి వరకూ, శారదాకాలనీలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బాధ్యతగా మొక్కల సంరక్షణ



మొక్కలు నాటుతున్న సర్పంచ్ పెంటయ్య

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల గ్రామ పంచాయతీ పార్కు వద్ద మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు, సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. భవిష్యత్తు తరాల కోసం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను విరివిగా నాటాలన్నారు. ఈవో శ్రీనివాసరావు, వార్డు సభ్యులు రవ్వ శ్రీను, టి.సత్యారావు, అర్జున్ నాయుడు, మోదినాయుడు, గొంతెన శ్రీనులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
బ్రో	:	సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	:	సత్యనారాయణ స్క్రీన్-2
బ్రో	:	షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)	:	పర్తిసాయి
బ్రో	:	వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 153 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	3,850	4,100
మూడోరకం	-	-

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-3 యూనిట్, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-2యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య (9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 394 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పక్కాగా.. 'సాగు'లెక్క

- ఈ క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో
- సబ్సిడీపై యంత్రాలు, ఎరువులు, విత్తనాలు
- వ్యవసాయ బీమాకు ఇదే ఆధారం

ఆరుగాలం శ్రమించి, సాగు చేసిన పంట నీట మునిగినా, మరే ప్రకృతి వైపరీత్యం బారినపడి నష్టపోయినా.. ఆ రైతు గుండె కోత చెప్పలేనంత. అలాంటి స్థితి ఏ రైతన్నకూ రాకూడదని, ఒకవేళ వచ్చినా ఆదుకునేందుకు రూపొందించిన కార్యక్రమమే ఈ–క్రాప్ నమోదు. రైతు రాజ్యంగా అందరి మన్ననలు పొందిన జగనన్న ప్రభుత్వం రైతన్నకు రక్షణ ఛత్రం పట్టింది. ఈ–క్రాప్ నమోదు అనకాపల్లి మండలంలో ప్రారంభమైంది.



వెంకుపాలెంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు



ఈ-క్రాప్ నమోదుపై రైతులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

అనకాపల్లి రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగంలో వినూత్న పథకాలను అమల్లోకి తెచ్చారు. రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల్లో ఈ–పంట నమోదు కూడా ఒకటి. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలు, పంట నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు పొందాలంటే అధికార్ల వద్ద రైతుల పంటల సాగు వివరాలు సమగ్రంగా ఉండాలి. ఇందుకోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. క్రాప్ బుకింగ్ పేరిట యాప్‌ను తీసుకువచ్చి పక్కాగా పంటల నమోదుకు శ్రీకారం చుట్టింది. అధికార్లు క్షేత్రస్థాయికి వెళ్లి పంటల నమోదు చేపడితే, ఈ యాప్‌లో నిక్షిప్తమవుతాయి.

క్రాప్ బుకింగ్ యాప్‌లో పూర్తి వివరాలు

అనకాపల్లి మండలంలో ఏఈవోలు క్షేత్రస్థాయిలో రైతుల పొలం వద్దకు వెళ్లి ఆయా రైతులు సాగు చేస్తున్న పంట ఫొటోలు తీసి, పంట విస్తీర్ణం, విత్తిన/నాట్లు వేసిన తేదీ, పంట పేరు తదితర వివరాలను క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. పంట పొలాల సర్వే నెంబర్ల వారీగా అధికారుల పర్యటనలన్నింటినీ జియో ట్యాగింగ్ చేస్తారు. ఖచ్చితమైన వివరాలు లెక్కించేందుకు రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ నుంచి శాటిలైట్ సాయంతో ఇమేజెస్ రూపంలో చిత్రీకరించేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. దీని ఆధారంగానే పంట పెట్టుబడి సాయం వంటివి నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అవుతాయి. ఇవే కాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఈ వివరాలే ప్రాతిపదిక.

అనకాపల్లి సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ సాగు వివరాలు

మండలం	ఆర్బీకేలు	రైతులు	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)
అనకాపల్లి	35	15,465	10,871
కశింకోట	19	15,636	6,366
మునగపాక	21	11,276	9,026
సబ్బవరం	17	10,450	16,300
పరవాడ	12	5,552	8,564

ప్రయోజనాలు అపారం

ఈ–క్రాప్‌లో రైతులు పంట వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది. తక్కువ ధరకే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు, వ్యవసాయ యంత్ర పరికరాలను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ నమోదు ద్వారా వెబ్ ల్యాండ్‌లో పొందుపరచిన పంటల ఆధారంగా రాష్ట్రంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు, దిగుబడి ఏ మేరకు వస్తుందన్న అంచనా వేసి, ఆ మేరకు మార్కెటింగ్ ఏర్పాట్లు చేస్తారు. ఈ–క్రాప్ ద్వారా రైతులకు అందించే ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ వంటివి పొందవచ్చు. పండిన పంటను మద్దతు ధరపై ఆర్బీకేల్లో విక్రయించవచ్చు.

ఈ–పంట నమోదు ఇలా

ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన వివిధ పంటల వివరాలను గ్రామాల వారీగా ఆర్బీకే అసిస్టెంట్స్, వీఆర్వోలు నాట్లు వేసిన తర్వాత, సాగులో ఉన్న పొలం వద్దనే వివరాలు సేకరిస్తారు. రైతు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేశారు, ఏ రకం పంటలను సాగు చేశారనే వివరాలను నమోదు చేస్తారు. కేవలం వరి పంటనే కాకుండా అన్ని రకాల పంటల వివరాలను పొలం వద్దనే రైతు ఫోటోతో సహా వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుస్తారు. ఇప్పటికే ఈ–క్రాప్ నమోదుకు ప్రక్రియపై ఆర్‌బీకే అసిస్టెంట్లకు, వీఆర్వోలకు వ్యవసాయాధికారులు శిక్షణ ఇచ్చారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలననుసరించి ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ–క్రాప్‌లో నమోదైన పంటల సాగు వివరాలను మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించి తుది జాబితాలను ఆర్బీకేల వద్ద ప్రదర్శిస్తారు. రైతుల అభ్యంతరాల మేరకు జాబితాను సవరిస్తారు.

ఈ-క్రాప్‌తో రైతుకు ధీమా



ప్రస్తుతం ఈ–క్రాప్ నమోదు ప్రారంభమైంది. పంటల నమోదు ప్రక్రియ పూర్తి చేయడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం వుంటుంది. వరి నాట్లు వేసిన ప్రతి సీజన్‌లో ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి. ప్రభుత్వం వద్దనున్న లెక్కలకు, క్షేత్ర స్థాయి పంట వివరాలతో సరిపోలడం వలన రాయితీలు, వ్యవసాయ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి తక్షణమే రైతుల ఖాతాలకు నగదు జమ చేసే అవకాశం ఉంటుంది. రైతులందరూ తమ పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి.

– పీయూబీపీ రంగాచారి, వ్యవసాయాధికారి, అనకాపల్లి

బొజ్జన్న కొండపై ప్రత్యేక పూజలు



బొజ్జన్నకొండపై బుద్ధుని స్థూపం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలోని శంకరం పంచాయతీ బొజ్జన్నకొండ వద్ద సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొని, ప్రజలు బుద్ధుని ఆశీస్సులు పొందాలని ఏటా శ్రావణ పౌర్ణమి రోజున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మణిపూర్‌లో శాంతి చేకూరి, ప్రజలు ఆనందంగా జీవించేలా చేయాలని బుద్ధుని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు గిలకల అప్పారావు, కాపారపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల అందజేత



నరసింగబిల్లి హైస్కూల్లో బాలికలకు సైకిళ్లను అందిస్తున్న నాయకులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న బాలికలకు మంగళవారం 86 సైకిళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో అరబిందో ఫార్మా అధినేత నిత్యానందరెడ్డి సహకారంతో సమకూర్చిన సైకిళ్లను అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జి ప్రసాదరావు, హెచ్‌ఎం సునీత, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ, నూతలగుంటపాలెం సర్పంచ్ కలిగెట్ల నూకరత్నం, ఏనుగుతుని సర్పంచ్ కొప్పాక నాగమణి, పార్టీ నాయకులు కలిగెట్ల నాయుడు, గోపీ, కొప్పాక గణేష్, కలిగెట్ల బాపునాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

మణిపూర్ హింసపై కాంగ్రెస్ ధర్నా



నెహ్రూచౌక్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

అనకాపల్లిటౌన్: మణిపూర్ రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కావాలనే మతకలహాలు సృష్టిస్తున్నాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రుత్తల శ్రీరామమూర్తి ఆరోపించారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మణిపూర్ మారణహోమానికి నిరసనగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం బాధాకరమన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రపంచం యావత్తూ నినదించినా, బీజేపీ మాత్రం సమర్థించే స్థాయికి దిగజారిందని ఆక్షేపించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ మణిపూర్ ప్రజలకు న్యాయం జరిగేలా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూండ్రపు అప్పారావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుద్ద కిశోర్, నాయకులు ఐ.ఆర్.గంగాధర్, దాసరి సంతోష్, ఆడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను అప్పగించాలి



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి జోన్ పరిధి సత్యనారాయణపురంలో నిర్మించిన టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మంగళవారం ఈ గృహాలను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి, తక్షణమే వాటిని లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. 2016లో రూ.20 కోట్ల వ్యయంతో హుద్‌హుద్ తుపాను బాధితుల కోసం నిర్మించిన ఇళ్లను కూడా వెంటనే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.బాలకృష్ణ, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్స్‌కు వైద్య శిబిరం

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.గౌరీపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ కేర్ ఆస్పత్రికి చెందిన గుండె, ఎముకలు, జనరల్ వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వీరాంజనేయుని వెండి విగ్రహం అందజేత



వెండి విగ్రహాన్ని ఆలయ అర్చకునికి అందిస్తున్న కిశోర్

అనకాపల్లిటౌన్: మండలంలోని శారదానది ఒడ్డునున్న అభయాంజనేయస్వామి ఆలయానికి వీరాంజనేయుని వెండి విగ్రహాన్ని ఎన్టీఆర్ క్రీడా మైదానం వాకర్స్ అండ్ వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కిశోర్ మంగళవారం అందించారు. విగ్రహాన్ని ఆలయ అర్చకుని చేతుల మీదుగా స్వామి చెంత ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన శక్తి కొలదీ ధార్మిక, సేవా కార్యక్రమాలకు సాయమందిస్తున్నట్టు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



జీవన ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పరవాడ: ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు వేసే రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి చెప్పారు. ఖరీఫ్ రైతులకు మంగళవారం ఆమె పలు సూచనలు, సలహాలు అందించారు. మండలంలోని కలపాక, స్వయంభూవరం, వెన్నలపాలెం, రావాడ, భర్నికం, తానాం పరవాడ గ్రామాల్లో వరి సాగుకు సమాయత్తమవుతున్న రైతులు పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగు మొక్కలను దమ్ములో వేసి కలియదున్నాలని సూచించారు. దమ్ములో ఎకరా పొలానికి 150 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 20 కిలోల పొటాష్, 30 కిలోల యూరియా చల్లి ఉభాలు వేసుకోవాలని వివరించారు. పంట పొలంలో వరి నారును చదరపు మీటరుకు 33 కుదుళ్లు వచ్చేలా నాట్లు వేసుకుంటే మెరుగైన దిగుబడులు పొందవచ్చని సూచించారు. ద్రవరూప జీవన ఎరువులైన అజోస్పైరిల్లం, పి.ఎస్.బి.పొటాషియం, రిలీజింగ్ బ్యాక్టీరియా ఒక్కో రకం అర లీటరు చొప్పున 100 కిలోల గెత్తంలో కలిపి ఒక రోజు నిల్వ చేసి తదుపరి ఎకరా పొలంలో చల్లుకోవాలన్నారు. దాని ద్వారా నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి మెరుగైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు.

అంగన్‌వాడీ కార్యాలయం ఏర్పాటు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి నియోజకవర్గ అంగన్‌వాడీ కార్యాలయాన్ని కశింకోటలోని బీసీ వసతిగృహంలో ఏర్పాటు చేసినట్లు సీడీపీవో పి.ప్రభావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కశింకోట మండలం, అనకాపల్లి పట్టణ, మండల అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి నియోజకవర్గంలో ఒకే కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణ, మండల అంగన్‌వాడీ కేంద్రాలకు కార్యాలయం గతంలో అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం అద్దెభవనంలో ఉండేదని, ఈ భవనాన్ని ఖాళీచేసి కశింకోటకు మార్చినట్టు వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 234 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకలాపాలు ఇక్కడి నుంచే కొనసాగుతాయన్నారు.

ఉత్తమ సొసైటీగా మునగపాక పీఏసీఎస్

మునగపాక : రైతులకు మెరుగైన సేవలందించడంలో విశేష కృషి చేస్తున్న మునగపాక పీఏసీఎస్‌ని 2022–23 సంవత్సరానికి ఉత్తమ సొసైటీగా ఎంపిక చేశారు. ఈ మేరకు సంఘ పర్సన్ ఇన్‌ఛార్జి కోనపల్లి రామ్మోహనరావుకు, సంఘానికి ఉత్తర్వులు అందాయి. సహకార బ్యాంక్ నుంచి రుణాలు, డిపాజిట్లు సేకరణ, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తూ జిల్లాలోనే ఆదర్శ సొసైటీగా గుర్తింపు పొందింది. ఆప్కాబ్ సంస్థ ఏర్పాటు చేసి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 4న విజయవాడలో ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర సహకార బ్యాంక్ నుంచి 4వ తేదీన విజయవాడకు రావాలని ఆహ్వానం అందినట్టు పర్సన్ ఇన్‌ఛార్జి తెలిపారు. రాష్ట్రంలోనే ఉత్తమ సొసైటీగా గుర్తింపు పొందడంలో సహకరించిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగులకు మేలు



భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

పరవాడ: భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందించాలని భవిత కేంద్ర నిర్వాహకులకు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.శకుంతల సూచించారు. ఆమె మంగళవారం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అలవెన్స్‌లు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిత సెంటర్ విద్యార్థులు చదువుపై చూపుతున్న శ్రద్ధను ఆమె అభినందించారు. ఆటపాటల్లో చురుకుదనం ప్రదర్శించిన విద్యార్థులను సహిత విద్య సమన్వయకర్త శకుంతల అభినందించారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసులు, వలంటీరు పాల్గొన్నారు.

నేడు సబ్బవరం పీహెచ్‌సీ ఆధునికీకరణకు శ్రీకారం

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునికీకరణ పనులతో పాటు అదనపు భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.1.50 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడి చేసిన వ్యక్తుల అరెస్ట్

అనకాపల్లిటౌన్: ఆర్టీసీ డ్రైవర్లపై దాడి చేసిన ఐదుగురిని మంగళవారం గ్రామీణ ఎస్‌ఐ నరసింగరావు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీ కార్గో బస్సులో డ్రైవర్ ఎస్.బాలాజీ, మరో డ్రైవర్‌తో కలిసి వెళ్తుండగా, కొప్పాక పైడితల్లమ్మ ఆలయం వద్ద ఐదుగురు దాడి చేశారు. దాడికి పాల్పడినవారు విజయరామరాజుపేటకు చెందిన ఎం.గణేష్, ఎం.రమేష్, జి.హనుమంత్, జి.డానీ, డి.హేమప్రసాద్‌లుగా గుర్తించారు. వీరి జాడ తెలియడంతో అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,500 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఆస్తి హక్కు పత్రాల అందజేత



నునపర్తిలో ఆస్తి హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో 27 మందికి ఆస్తి హక్కు ధ్రువీకరణ పత్రాలను సర్పంచ్ చుక్కా అనురాధ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. జగనన్న భూ రక్ష, జగనన్న సంపూర్ణ భూ హక్కు పథకంలో భాగంగా సర్వే చేసిన మేరకు గ్రామ కంఠంలో ఉన్న వారికి ఈ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లె వెంకటరావు, ఉప సర్పంచ్ యాండ్ర పైడిరాజు, డెయిరీ ప్రెసిడెంట్ నరసింగరావు, సచివాలయ కన్వీనర్ కూండ్రపు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



మద్యం బ్యాటిల్స్‌తో పట్టుబడిన వెంకటసతీష్‌తో ఎస్‌ఐ దివాకర్‌యాదవ్

అనకాపల్లిటౌన్: అక్రమంగా 8 మద్యం(క్వార్టర్) బాటిళ్లను తరలిస్తున్న సాలాపు వెంకటసతీష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ దివాకర్‌యాదవ్ మంగళవారం చెప్పారు. పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన వెంకటసతీష్ వాహనంలో మద్యం బాటిళ్లు దొరికాయన్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకుంటే ప్రశాంతమైన జీవనం గడపవచ్చని సమరసత ఫౌండేషన్ సభ్యుడు పోతు రంగారావు అన్నారు. వేమగిరి గ్రామంలో చిన రామాలయంలో టీటీడీ వారి సౌజన్యంతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతం ఆచరించారు. ప్రతి పౌర్ణమికి ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ఇటువంటి వ్రతాలు పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ వ్రతాల్లో పాల్గొనే దంపతులకు పూజా సామాగ్రి ఉచితం అందజేసినట్టు చెప్పారు.